క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన గుడివాడ మునిసిపల్ కమిషనర్



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మను శుక్రవారం గుడివాడ మునిసిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఇటీవల మునిసిపల్ కమిషనర్ బదిలీల్లో భాగంగా కాకినాడ కార్పొరేషన్‌లో డెప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను గుడివాడ మునిసిపల్ కమిషనర్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో మనోహర్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపాధ్యాయులకు మెడికల్ క్యాంపు



మచిలీపట్నంఅర్బన్: జిల్లాలోని టీచర్ల బదిలీల కోసం నూతన మెడికల్ సర్టిఫికెట్ (ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్స్) పొందుటకు మచిలీపట్నం గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షల నిమిత్తం శుక్రవారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఉండి ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో కొనసాగుతున్న 20 మండలాల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రస్తుత కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లోని టీచర్లు శనివారం, ఉమ్మడి జిల్లా పరిధిలో ఉండి ప్రస్తుతం ఏలూరు జిల్లాలో కొనసాగుతున్న ఎనిమిది మండలాల్లోని టీచర్ల కోసం ఆదివారం మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నారు. టీచర్లు వారి వద్ద ఉన్న అనారోగ్య సంబంధిత సర్టిఫికెట్లను చూపించి నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందవచ్చు. మెడికల్ పరీక్షలు చేయుంచుకొని సంబంధిత డాక్టర్ నుంచి పొందిన నూతన మెడికల్ సర్టిఫికెట్ మాత్రమే ప్రిఫరెన్సియల్ కేటగిరిలో సమర్పించాల్సి ఉంది.

ఉరుసు ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు



గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన హజ్రత్ నిర్గన్ షా ఔలియా దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం భక్తులు పోటెత్తారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు సమర్పించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైసూరుకు చెందిన రాబియా చిష్టి, ఢిల్లీకి చెందిన సర్ ఫరాజ్ అలీల బృందాల మధ్య పోటాపోటీగా సాగిన ఖవ్వాలీ భక్తులను అలరించింది. కాగా గురువారం రాత్రి నిర్వహించిన సందల్ ఊరేగింపులో భాగంగా బాబా ప్రతీకగా ఆకుపచ్చ జెండా, గుర్రాన్ని తీన్‌మార్ వాయిద్యాలతో ఊరేగించారు. శుక్రవారం తెల్లవారుజామున దర్గాకు చేరిన ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు



చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురంలో వేంచేసియున్న శ్రీదుర్గా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలోని నందీశ్వరునికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలా మాసశివరాత్రి ముందు రోజు బహుళ త్రయోదశిని పురస్కరించుకుని నందీశ్వరునికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

మట్టి ట్రాక్టర్ పట్టివేత

పెడన: మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికంగా మట్టి తోలుతున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రెవిన్యూ సిబ్బంది పట్టుకున్నారు. పెడన – గుడివాడ బైపాస్‌రోడ్డులో మట్టి తరలిస్తున్న సమయంలో రెవిన్యూ సిబ్బంది పట్టుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.

రైతులకు పీఎండీఎస్ కిట్లు అందజేత



పెడన: పంట పొలాల్లో నేలను సారవంతం చేయడానికి వినియోగించే పీఎండీఎస్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి మనోహర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి, ఏడీఏ శ్రీనివాసరావు, డీపీఎం నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పీఎండీఎస్ కిట్లు వాటి వల్ల కలిగే లబ్ధి తదితర విషయాలను రైతులకు వివరించారు. పెడన వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



లంకలకలువగుంట గ్రామానికి వెళ్లే రోడ్డుపై సీలేరు కాలువపై ఉన్న కల్వర్టు



ఒకపక్క కాలువలోకి కుంగిపోతున్న కల్వర్టు

- సీలేరు పంట కాలువపై కుంగిన కల్వర్టు
- ఆందోళనలో లంకలకలువగుంట, ఉరివి గ్రామాల ప్రజలు

పెడన: మండల పరిధిలోని పెనుమల్లి, నేలకొండపల్లి గ్రామాల మీదుగా లంకలకలువగుంట, ఉరివి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో సీలేరు పంట కాలువ ఉంది. ఈ మార్గంలో కాలువపై కల్వర్టు నిర్మించి రహదారి ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరడమే కాకుండా కాలువలోకి కుంగిపోయింది. ఒకపక్క ఇప్పటికే కుంగిపోగా ఎప్పుడు కూలిపోతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించే గ్రామస్తులు భారీ వాహనాలు రాకుండా అడ్డుకుంటున్నారు. ఇప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయిందని ఇప్పటి నుంచి అయినా భారీ వాహనాల రాకపోకలు నిలుపుదల చేయకపోతే తమ గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు. సంబంధిత శాఖాధికారులకు, ఎమ్మెల్యే దృష్టికి సైతం ఈ కల్వర్టు విషయాన్ని తీసుకువెళ్లడం జరిగిందని చెబుతున్నారు. అయితే సంబంధిత శాఖాధికారులు అస్సలు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇది ఒకటే మార్గం



ఈ మార్గంలో నిత్యం రాకపోకలు చేస్తుంటాం. ఇప్పటికే రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. కల్వర్టు పడిపోయి రోడ్డు మార్గం మూతపడితే మేమంతా బంటుమిల్లి మండలం కంచడం మీదుగా వెళ్లి పెడన రావాల్సి ఉంటుంది. ఇది చాలా దూరం. అధికారులు, పాలకులు స్పందించి ఈ కల్వర్టు కూలిపోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– తోకల గౌతమి, లంకలకలువగుంట గ్రామం

ప్రమాదకరంగా కల్వర్టు



పెడనకు దగ్గర దారి నేలకొండపల్లి మీదుగా వెళ్లడమే. అటువంటి మార్గంలో సీలేరు కాలువపై కల్వర్టు ప్రమాదకరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎప్పుడు పడిపోతుందోనని భయం వెంటాడుతోంది. ఇది పడిపోతే మాత్రం చుట్టూ తిరిగి ప్రయాణం చేయాలంటే డీజిల్‌కు తడిసి మోపెడవుతుంది. కిరాయిలు పెగిరిపోతాయి. అధికారులు, పాలకులు స్పందించి తక్షణ మరమ్మతులు చేపట్టాలి.

– దాసరి చోళరాజు, ఆటో డ్రైవర్, లంకలకలువగుంట గ్రామం

హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: నగరంలో స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి నగర పాలకసంస్థ పాలకవర్గం, అధికారులు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరుతూ కమిషనర్ బాపిరాజుకు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణ కమిటీ సభ్యులు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శి పీవీ ఫణికుమార్ మాట్లాడుతూ సీతారామయ్య స్మారక భవనం నిర్మాణానికి స్థలం కేటాయింపు కొరకు ఎంఎంసీ కౌన్సిల్ ఎజెండాలో తీర్మానం పెట్టమని ఆదేశిస్తూ ఈ నెల 21వ తేదీన హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల కాపీని కమిషనర్ బాపిరాజుకు ఆయన ఛాంబర్‌లో అందజేశారు. కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది సోడిశెట్టి బాలాజీ రావు, కమిటీ సభ్యులు పుప్పాల ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, ధూళిపాళ్ల శ్రీరామ చంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన



మడక గ్రామంలో మట్టి పరీక్షల వారోత్సవాల్లో మనోహర్, పార్థసారథి తదితరులు

పెడన: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టి పరీక్షల వారోత్సవాలను నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌వైవీఎస్ మనోహర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మడక గ్రామంలో శుక్రవారం జరిగిన మట్టి పరీక్ష వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడన మండల వ్యాప్తంగా 18 రైతు సేవా కేంద్రాలున్నాయని, వీటి ద్వారా 1,172 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల భూసారం ఎంత ఉంది, ఎటువంటి పోషక ఎరువులు వినియోగించాలనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే పార్థసారధి, మచిలీపట్నం ఏడీఈ రమాదేవి, డీఆర్సీ శ్రీనివాసరావు, టెక్నికల్ ఏఓ గీతాదేవి, పెడన ఇంఛార్జి ఏవో నూరున్నిసా, వీఏఏలు, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కూటమిలో భగ్గుమన్న విభేదాలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి సాక్షిగా ఎమ్మెల్యే తీరుపై మండిపడ్డ టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

అవనిగడ్డ: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సాక్షిగా జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తీరుపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చల్లపల్లిలో గురువారం టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుతో పాటు ఆరు మండలాల నుంచి టీడీపీ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కోడూరు మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఎమ్మెల్యే కుమారుడు, అల్లుడిని ఉద్దేశించి మాట్లాడుతూ మద్యం, ఇసుక, మట్టిని దోసుకుంటున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. టీడీపీ కార్యకర్త ఎవరన్నా సొంత పొలానికి ట్రక్కు మట్టి తోలుకుంటే వారిపై అధికారులు, పోలీసులను ఉసిగొల్పి కేసులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. కోడూరు మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై పోస్టులు పెట్టిన తెలుగు యువత నాయకుడిపై కేసులు పెట్టించారని చెప్పారు. టీడీపీలో ఎవరికి పదవులు ఇవ్వాలో నిర్ణయించేది జనసేన ఎమ్మెల్యే అయినపుడు దశాబ్దాలు తరబడి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న తాము పార్టీకి విధేయులుగా ఉండటం ఎందుకని ప్రశ్నించారు.

ఎమ్మెల్యేతో కలిసి పనిచేయలేం..

టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అధికారుల దగ్గర విలువ లేకుండా పోయిందని ఆ పార్టీ నాగాయలంక మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి వెంటనే ఇన్‌చార్జిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కొంతమంది టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తో కలిసి పనిచేయలేమని తేల్చి చెప్పారు. జనసేన కార్యకర్తలు తప్పు చేస్తే సర్దుపోవచ్చుకాని ఎమ్మెల్యేనే ఇదంతా చేస్తుంటే ఎలా భరించాలని ప్రశ్నించారు. దీంతో ఇన్‌చార్జి మంత్రి సుభాష్ టీడీపీ నేతలను బుజ్జగించే ప్రయత్నం చేశారు. మీ పరిస్థితిని అర్థం చేసుకుంటానని అందుకే ఇకపై నెలలో రెండు రోజులు నియోజకవర్గంలో పర్యటించి అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పుకొచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఏడు నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎ.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని చల్లరాస్తాసెంటర్, చెమ్మనగిరిపేట, బలరామునిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కోడూరు మండలంలో..

కోడూరు: కోడూరు మండలంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ గోపిచంద్ శుక్రవారం తెలిపారు. బస్‌స్టాండ్ సమీపంలోని ఇళ్ల లైన్, ఎస్సీకాలనీ, ముందడుగు, స్వతంత్రపురం, శ్రీరామపురం, హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాలతోపాటు ఉల్లిపాలెం, వేణుగోపాలపురం చెరువులకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.


అర్జీల స్వీకరణ



మచిలీపట్నంటౌన్: వివిధ సమస్యలపై ప్రజల నుంచి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం అర్జీలు స్వీకరించారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో ప్రజలు మంత్రి రవీంద్రకు వినతులు అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం కృత్తివెన్ను టీడీపీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులపై సమావేశం



బంటుమిల్లి: సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వచ్చేనెల రెండు నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించనున్న వేసవి శిక్షణ తరగతులపై పలు శాఖల సిబ్బందికి శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీడీపీఓ ఎం. సముద్రవేణి, పీహెచ్‌సీ వైద్యాధికారి కే పవన్‌కుమార్, ఏపీఎం దశరథరామయ్య పాల్గొని 15 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలకు ప్రతి నెలా మంగళవారం, శుక్రవారం సమావేశాలు నిర్వహించి పలు చట్టాలు, బాల్య వివాహాలు తదితర విషయాలపై అవగాహన కలిగించాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల సంరక్షణ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సమైఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



మచిలీపట్నంలో కొవ్వొత్తుల ప్రదర్శన



బంటుమిల్లి మజీద్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మైనార్టీ సభ్యులు

మచిలీపట్నంటౌన్: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా నగరంలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది శుక్రవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదానికి నిరసనగా నినాదాలు చేశారు.

మోపిదేవిలో..

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడి సెంటర్‌లో అవనిగడ్డ నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నినాదాలు చేశారు. నడకుదుటి జనార్ధనరావు, దిడ్ల రాంబాబు, రావి రత్నగిరి, పూషడపు రత్నగోపాల్, మత్తి వెంకటేశ్వరావు, మత్తి వంశీ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: ఉగ్రవాదులు ఎక్కడున్న పట్టుకుని కఠినంగా శిక్షించాలని స్థానిక మజీద్ కమిటీ కోరారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం మజీద్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. దాడిలో మృతిచెందిన 26 మందికి నివాళులర్పించారు. మజీద్ గురువు ఖామూరుజమ, చినగురువు జమేదారు, మతపెద్దలు, ఎంపీటీసీ సభ్యుడు ఎండీ కమాల్‌బాషా, ఎండీ నజీర్, ఎస్‌కే బాషీ, షేక్ జిలానీ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థినిని సన్మానిస్తున్న మల్లికార్జునరావు



విద్యార్థులను సన్మానిస్తున్న సురేష్, నేతలు

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి జెడ్పీ పాఠశాలలో పది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు పీ జయంతి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు బ్యూల(581), నాగశివజ్యోతి(578), చేతన సౌమ్య(572)మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు మాట్లాడుతూ తాను ఇచ్చిన హామీ మేరకు ఒకొక్కక్క విద్యార్థినికి త్వరలోనే రూ. లక్ష విలువుగల గోల్డ్ చెయిన్ అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు.

ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో..

ఘంటసాల: ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో మండల స్థాయిలో అధిక మార్కులు సాధించిన డి.జయ సింధూన, కె.చరణ్ తేజ, ఆకాష్, నాగకుమారి, సంజనలను స్థానిక గౌతమ్ ట్యూటోరియల్స్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ సురేష్‌బాబు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేట్‌కు ధీటుగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ట్యూటోరియల్ నిర్వాహకురాలు మేరుగు ప్రశాంతి, డి.కోటయ్య, మేరుగు వేణుగోపాలరావు, పి.గోవర్ధనరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎం.సుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు, దివ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెడనలో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య

పెడన: పట్టణంలోని 18వ వార్డు ఇందిరా కాలనీలో ఎస్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య మాట్లాడుతూ ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు వస్తున్నాయని, వాటి ద్వారా గౌరవంగా జీవించాలని సూచించారు. ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ముదిగొండ ఫణిదూర్జిటి మాట్లాడుతూ ఎస్టీలు ధ్రువీకరణ పత్రాలను పొందే విషయంలోనే కాకుండా ఎస్టీ కార్పొరేషన్ రుణాలు పొందే విషయంలో ఏమైనా సందేహాలుంటే నేరుగా కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలభాస్కర్, మణికంఠ, స్థానిక నాయకులు చంద్రమోహన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



ప్లాస్టిక్ రహిత ఏపీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, డాక్టర్ దాస్, డాక్టర్ ప్రశాంతి

ఘంటసాల: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాస్ అన్నారు. ఘంటసాల వెలుగు సమావేశపు హాలులో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో శుక్రవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ప్రత్యేక చట్టాలు, అక్రమ రవాణ, వినియోగదారుల హక్కులు, బయో మెడికల్ టెస్ట్ మేనేజ్‌మెంట్ చట్టం, బలవంతపు అప్పుల పరిష్కారం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మచిలీపట్నంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉందని, వెనుకబడిన కులాలకు, న్యాయ సలహాలు, న్యాయం చేయడానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ పోస్టర్ ఆవిష్కరించి స్వచ్ఛ సేవా భారత్, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ బీ విజయప్రసాద్, ఘంటసాల ఇన్‌చార్జి ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు ఝాన్సీ, నరసమ్మ, నాగేశ్వరమ్మ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వీఓఏలు, మహిళలు పాల్గొన్నారు.

రామకృష్ణను పరామర్శించిన ఉప్పాల



రామకృష్ణతో మాట్లాడుతున్న రాము

బంటుమిల్లి: ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయి ఆత్మహత్య చేసుకున్న గోవాడ అనీల్ కుమార్ తల్లిదండ్రులను వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్(రాము) శుక్రవారం పరామర్శించారు. మండల పరిధిలోని పెదతుమ్మిడి శివారు అర్జావానిగూడెం గ్రామానికి చెందిన గోవాడ రామకృష్ణ కుమారుడు పదవ తరగతి పరీక్షల్లో తప్పి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రాము పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఒడిమి చిన్నారిబాబు, అర్తమూరు సర్పంచ్ బొర్రా రమేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పాలడుగు బాబూరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా కన్వీనరు కే మహంతిప్రసాదు, రాంకీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు తాగునీటి సరఫరా

కోడూరు: మండలంలోని తీరప్రాంత గ్రామాలైన చింతకోళ్ల, బసవానిపాలెంకు మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీటిని సరఫరా చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో ట్యాంకర్ ద్వారా గ్రామస్తులకు నీటిని అందించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు మండలి వెంకట్రామ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

పెడన: మండల పరిధిలోని నందమూరు శివారు జయంతి కాలనీ సమీపంలోని 216 ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో బంటుమిల్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న తండ్రి, కుమార్తె గాయపడ్డారు. వీరిని అదే కారులో ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లుగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

పెడన: పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. డ్రోన్ కెమెరాను వినియోగించి పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2,220ను స్వాధీనం చేసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

చలివేంద్రం ప్రారంభం

పెడన: స్థానిక శివాలయం సమీపంలో మేమున్నాం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, మేమున్నాం సంస్థ వ్యవస్థాపకుడు వీణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

125 మందికి ఉచిత వైద్య పరీక్షలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం జరిగిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 125 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గుడివాడ ప్రభుత్వ గురురాజు హోమియో వైద్యశాల వైద్యులు లక్ష్మీ ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు యామిని, ఫాతిమా, ఝాన్సీ, మధుమితలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు జీ వాసుదేవరావు, ఏ రమణ పాల్గొన్నారు.

టెనెక్టెప్లేస్ ఇంజక్షన్లు వినియోగించుకోండి

చల్లపల్లి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(ప్రభుత్వ ఆసుపత్రి)లో గుండెపోటుకు గురైన వ్యక్తులకు తక్షణ ఉపశమనం కల్గించే టెనెక్టెప్లేస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్ సూచించారు. అత్యాధునికమైన రూ.40వేలు విలువచేసే ఈ ఇంజక్షన్‌లు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గుండె పోటుకు గురైన వ్యక్తికి ఈ ఇంజక్షన్ అందిస్తే మెరుగైన చికిత్స పొందేందుకు సమయం లభిస్తుందని వివరించారు.

మజ్జిగ పంపిణీ

మచిలీపట్నంఅర్బన్: మండుటెండలో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు, వారి సహాయకుల నిమిత్తం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిరోజూ మజ్జిగ పంపిణీని ఏర్పాటు చేశారు. ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ భానుమూర్తి శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు.